


ప్రతి గ్యారంటీ పథకాన్ని తప్పనిసరిగా అమలు చేస్తాం


# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd





ఎలక్ట్రికల్ షాప్‌లో భారీ అగ్ని ప్రమాదం


Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 63 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 06 రూ - 03/- ఆదివారం 3 మార్చి 2024







# వారణాసి నుంచి మళ్లీ మోడీ పోటీ



**న్యూఢిల్లీ,మార్చి 2 :(పిసిడబ్ల్యూ న్యూస్):** లోక్‌సభ ఎన్నికలకు అధికార భారతీయ జనతా పార్టీ సమరశంఖం పూరించింది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది.మొత్తం 195 స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వరసగా మూడో సారి వారణాసినుంచి బరిలో దిగనున్నారు. శనివారం ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్‌డే అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. ప్రధాని మోడీ నేతృత్వంలో ఇప్పటికన్నా భారీ మెజారిటీలో మూడో సారి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేస్తామన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ(సిఇసి)16 రాష్ట్రాల్లోని అభ్యర్థులపై ఇటీవల సుదీర్ఘంగా చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఆ క్రమంలోనే ఈ జాబితా విడుదలయింది.ఈ జాబితాలోఅమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ సహా 34 మంది కేంద్రమంత్రుల పేర్లను ప్రకటించారు. ఇందులో ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు చోటు కల్పించారు. తొలి జాబితాలో 28 మంది మహిళలున్నారు. యువతకు 47, ఎస్‌సిలకు 27, ఎస్‌టిలకు 16 స్థానాలు కేటాయించినట్లు తావ్‌డే తెలిపారు. తొలి జాబితాలో 57 మంది ఒబిసిలకు చోటు కల్పించారు. రాష్ట్రాలవారీగా చూస్తే అత్యధికంగా యుపిలో 51 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. పశ్చిమ బెంగాల్ 20,మధ్యప్రదేశ్ 24, గుజరాత్ 15, రాజస్థాన్ 15,కేరళ 12, తెలంగాణ 9,జార?ండ్ 11,చత్తీస్‌గఢ్ 12, ఢిల్లీ5, జమ్మూ, కశ్మీర్ 2,ఉత్తరాఖండ్ 3,అరుణాచల్‌ప్రదేశ్ 2,గోవా, త్రిపుర,అండమాన్ నికోబార్,

వివరాలు 2లో



# 11న ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభం

- అర్హులైన పేదలకు లబ్ధి జరిగేలా మార్గదర్శకాలు
- సొంత స్థలంలో ఇల్లు కట్టుకుంటే రూ.5 లక్షల సాయం
- మొదటి దశలో నియోజకవర్గానికి 3500 ఇళ్లు
- విధి విధానాలపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్,మార్చి 2 :(పిసిడబ్ల్యూ న్యూస్):** 11న ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని అన్నారు. శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తో పాటు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించిన మార్గదర్శకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఇతర అధికారులు ఇందులో పాల్గొన్నారు.

వివరాలు 2లో

# జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు



- జేఎన్‌జే సభ్యులు సహా అందరికీ లబ్ధి
- నగరానికి నలువైపులా ఇళ్లు, ఇళ్ల స్థలాలు
- మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,మార్చి 2 :(పిసిడబ్ల్యూ న్యూస్):** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం త్వరలో పరిష్కరిస్తుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస ్రెడ్డి తెలిపారు. రెండున్నర లక్షల చొప్పున చెల్లించి గడిచిన 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించ చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని చెప్పారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మాట్లాడుతూ జర్నలిస్టుల సంఘాలు, ప్రతినిధులు, హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో త్వరలో సమావేశమై ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. హైదరాబాద్‌లో జర్నలిస్టులకు నగరానికి నాలుగు వైపుల స్థలాలను గుర్తించి ఎవరికి ఎక్కడ అనువైతే అక్కడే ఇచ్చేలా అవకాశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ దైనందిన సమస్యలతో జర్నలిస్టులు వృత్తిపరమైన నైపుణ్యతపై దృష్టి సారించలేకపోతున్నారని, మీడియా అకాడమీ వారిలో నైపుణ్యతను పెంచడానికి కృషి చేయాలన్నారు. అకాడెమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం అక్రిడిటేషన్, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల వంటి సమస్యలను సంబంధం లేకుండానే అకాడెమీకి అప్పగించడంతో ఇబ్బందులు ఎదురయ్యాయన్నార. సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, సీఎం సీపీఆర్‌ఓ అయోధ్య రెడ్డి, ఏపీప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్, సీపీఐ నాయకులు డాక్టర్ కె.నారాయణ, పల్లా వెంకట్‌రెడ్డి, సియాసత్ ఎడిటర్ అమెర్ అలీఖాన్, ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హ న్మంతరావు పాల్గొన్నారు.

# యుపిలో ఆర్ఓ, ఎఆర్ఓ పరీక్ష రద్దు



లక్నో,మార్చి 2 :(పిసిడబ్ల్యూ న్యూస్): ప్రశ్నాపత్రం లీకేజ్ జరిగినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో రివ్యూ అధికారులు(ఆర్ఓ), సహాయ రివ్యూ అధికారుల(ఎఆర్ఓ) నియాకాల కోసం ఫిబ్రవరి 11న నిర్వహించిన ప్రాథమిక పరీక్షను ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం శనివారం రద్దు చేసింది. రు నెలల్లోగా మళ్లీ పరీక్షను నిర్వహించాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు. పేపర్ లీకేజీ వ్యవహారాన్ని దర్యాప్తు చేసే బాధ్యతను ఉత్తర్ ప్రదేశ్ పోలీసుకు చెందిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్(ఎస్‌టిఎఫ్)కు ప్రభుత్వం అప్పగించింది. ఆర్ఓ, ఎఆర్ఓ నియామకాల కోసం ఉత్తర్ ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫిబ్రవరి 11న నిర్వహించిన పరీక్షను రద్దు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

# పదేళ్ల బీఆర్ఎస్ కష్టానికి ఫలితం దక్కింది : కేటీఆర్



**హైదరాబాద్,మార్చి 2 :(పిసిడబ్ల్యూ న్యూస్):** అధికారంలోకి వచ్చిన క్షణం నుంచి పదేళ్ల పాటు ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు బీఆర్ఎస్ చేసిన సుదీర్ఘ పోరాటం ఫలించడం సంతోషంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారి, హైదరాబాద్-నాగపూర్ జాతీయ రహదారి రూట్లలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రక్షణ శాఖ భూములు ఇవ్వడానికి కేంద్రం పచ్చజెండా ఊపడం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ బీఆర్ఎస్ పార్టీ సాధించిన విజయమని గుర్తుచేశారు. గత ఏడాది జూలై 31న జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం వీటిపై నిర్ణయం తీసుకుందని, దానికి అనుగుణంగా కేంద్రం ఆమోదం తెలపడం హర్షించదగ్గ పరిణామమని పేర్కొన్నారు.గతంలోనే రక్షణశాఖ తమ ఆధీనంలోని 33 ఎకరాలను కేటాయించిందని, ఇప్పుడు మరో 150 ఎకరాలను కూడా అప్పగించేందుకు ముందుకు రావడంతో స్కైవేల నిర్మాణానికి ఉన్న అన్ని అడ్డంకులు తొలగిపోయాయని కేటీఆర్ వెల్లడించారు. ఈ రెండు రూట్లలో రక్షణ శాఖ భూములు ఉండటం వల్ల ఇంతకాలం రోడ్ల విస్తరణ సాధ్యం కాకపోవడం, దశాబ్దాల పాటు ప్రభుత్వాలు ఫ్లైఓవర్ల నిర్మాణానికి చొరవ తీసుకోకపోవడంతో.. ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇంత కాలం ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. అందుకే 2014 లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఈ రెండు మార్గాల్లో ఎలివేటెడ్ ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం అనేక కీలక ప్రణాళికలు రూపొందించామని, కేంద్ర

వివరాలు 2లో

## 11న ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. అందుకు అనుగుణంగా విధి విధానాలను తయారు చేయాలని చెప్పారు. ప్రజా పాలనలో నమోదు చేసుకున్న అర్హులందరికీ ముందుగా ప్రాధాన్యమివ్వాలని అన్నారు. గత ప్రభుత్వం డబుల్ ఇండ్ల నిర్మా ణంలో చేసిన తప్పులు జరగకుండా, అసలైన అర్హులకు లబ్ధి జరిగేలా చూడాలని అధికారులను అప్ర మత్తం చేశారు. ముందుగా ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేయాలని సూచన ప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. దశల వారీగా గూడు లేని నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చ డం తమ ప్రభుత్వ సంకల్పమని సీఎం తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంటి స్థలం ఉన్న వారికి అదే స్థలంలో కొత్త ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలు అందిస్తారు. ఏయే దశల్లో ఈ నిధులను విడుదల చేయాలనే నిబంధనలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు అందాల్సిన నిధులు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని చెప్పా రు. సొంత జాగాలో ఇల్లు కట్టుకునే వారికి ఉపయోగపడేలా వివిధ రకాల ఇంటి నమూనాలు, డిజైన్ల ను తయారు చేయించాలని సీఎం సూచించారు. లబ్ధిదారులు సొంత ఇల్లు తనకు అనుగుణంగా నిర్మా ణం చేపట్టినప్పటికీ తప్పనిసరిగా ఒక వంటగది, టాయిలెట్ ఉండేలా చూడాలన్నారు. ఇంటి నిర్మా ణాలను పర్యవేక్షించే బాధ్యతలను వివిధ శాఖల్లో ఉన్న ఇంజనీరింగ్ విభాగాలకు అప్పగించాలని సీఎ ం సూచించారు. జిల్లా కలెక్టర్ల అధ్వర్యంలో ఇంజనీరింగ్ విభాగాలకు ఈ బాధ్యతలను ఇవ్వాలని చెప్పారు.

## పదేళ్ల బీఆర్ఎస్ కష్టానికి ఫలితం దక్కింది : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అన్ని నిరంతర సంప్రదింపులు జరిపామని తెలిపారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతి సందర్భంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తోపాటు.. తాను, ఇతర మంత్రులు, ఎంపీలు ఢిల్లీ పెద్దలను కలిసి వినతిపత్రాలు అందజేశామని, ప్రతి సందర్భంలో వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎలివేటెడ్ ఫ్లైఓవర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన అన్ని రకాల ప్రణాళికలను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, వారు లేవనెత్తిన ప్రశ్నలకు ఎప్పటికప్పుడు సమాధానాలు అందిస్తూ ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు. హైదరాబాద్‌లోని రక్షణ శాఖ భూముల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో ఇక ఆయా రూట్లలో వచ్చి వెళ్లే ప్రజలకు పూర్తిగా ట్రాఫిక్ కష్టాలు పూర్తిగా తీరిపోతాయని కేటీఆర్ సంతోషం వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు గత బీఆర్ఎస్ పదేళ్ల పాటు చేసిన పోరాటంలో భాగస్వాములైన అధికారులకు, యంత్రాంగానికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఏ ఒక్కరి వల్లనో ఇది సాధ్యం కాలేదని, ఇది సమిష్టి విజయమని స్పష్టంచేశారు. ఎల్బీనగర్ తో పాటు.. ఇతర రూట్లలో ఇలాంటి అడ్డంకులు లేకపోవడంతో... గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో.. యుద్ధప్రాతిపదికన అనేక ఫ్లైఓవర్ల నిర్మాణాలు పూర్తిచేయగలి గామని గుర్తుచేశారు. తమ పాలనలో మెరుపు వేగంతో నిర్మించిన ఫ్లైఓవర్లు, అండర్ పాస్ ల వల్ల హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ సమస్యలు శాశ్వతంగా తీరిపోయాయని కేటీఆర్ స్పష్టంచేశారు. తాజాగా జేబీఎస్ నుంచి శామీర్ పేట, ప్యారడైజ్ నుంచి కండ్లకోయ రూట్లలో రెండు ఫ్లై ఓవర్లకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించిన నేపథ్యంలో.. ఇక రాష్ట్ర ప్రభుత్వం వీటి నిర్మాణాలను అత్యధిక ప్రాధాన్యతా క్రమంలో పెట్టుకుని పనులు చేపట్టాలని కోరారు. దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించిన నేపథ్యంలో.. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఎలివేటెడ్ ఫ్లైఓవర్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. వీటి వల్ల హైదరాబాద్ నలుదిశలా విస్తరించడంతో పాటు.. ప్రతి రూట్‌లోనూ ప్రగతిపథంలో దూసుకుపోవడానికి మార్గం సుగమమవుతుందని వెల్లడించారు. ఇన్నాళ్లకు తమ పోరాటాన్ని గుర్తించి దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వ పెద్దలకు కేటీఆర్ ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

## ఎలక్ట్రికల్ షాప్‌లో భారీ అగ్ని ప్రమాదం

**మంచిర్యాల,మార్చి 2 :(పిసిడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణంలోని సీసీ కార్నర్ రాజా ఎలక్ట్రికల్స్ పక్కన గల ట్రాన్స్ ఫార్మర్ లో షార్ట్ సర్క్యూట్ జరిగి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ట్రాన్స్ ఫార్మర్ పక్కన ఉన్న రెండు షాపులు పూర్తిగా దగ్ధం అయినవి. ఈ ప్రమాదంలో దాదాపు 50 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. కాలిపోయిన రెండు షాపుల్లో భారీగా మంటలు ఎగిసి పడడంతో చుట్టు పక్కల ఉన్న ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# ప్రతి గ్యారంటీ పథకాన్ని తప్పనిసరిగా అమలు చేస్తాం

**- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు - గృహజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు జీరో బిల్ అందజేత**





**పెద్దపల్లి జిల్లా,మార్చి 2 :(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీ, అభయహస్తం గ్యారెంటీ పథకాలను తప్పనిసరిగా అమలు చేస్తామని, మరో రెండు గ్యారెంటీ పథకాల అమలును ప్రభుత్వం ప్రారంభించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని పట్టణంలో తన క్యాంపు కార్యాలయం సమీపంలోని సత్యసాయి నగర్ లో గృహ జ్యోతి కార్యక్రమం క్రింద జీరో బిల్లులు లబ్ధిదారులకు అందించడం జరిగింది. సత్య సాయి నగర్ లో నివాసం ఉంటున్న డి.వేణుకు 481 రూపాయలు, మంథని లక్ష్మికి 179 రూపాయలు గృహ జ్యోతి సబ్సిడీ క్రింద కరెంట్ బిల్ ప్రభుత్వం చెల్లించి జీరో బిల్లులను వారికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు మరో రెండు గ్యారెంటీ పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, 200 యూనిట్ల వరకు గృహ వినియోగానికి ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాల అమలును ప్రారంభించామని అన్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం క్రింద ఇప్పటి వరకు 20 కోట్ల జీరో బస్ టికెట్స్ అందించామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచడం ద్వారా వేల మందికి లబ్ధి చేకూరిందని అన్నారు. గత ప్రభుత్వాలు అవలంబించిన ఆర్థిక విధానం వల్ల మన ఆర్థిక వ్యవస్థ బాగా దెబ్బతిందని, దానిని సరిచేస్తూ ఒక్కో పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు అర్ధరహిత విమర్శలు మానుకోవాలని, గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులలో నాణ్యత, డిజైన్ లోపాలు ఉన్నాయని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తెలియజేసిందని, ముందు వారు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. మంథని ప్రాంతంలో ఉన్న వనరులు ఇక్కడి ప్రజల భూములు వినియోగించుకొని పెద్దపల్లి, భూపాల్ పల్లి జిల్లాకు ఒక్క ఎకరానికి సైతం సాగునీరు అందించకుండా ప్రాజెక్టు రూపకల్పన గత ప్రభుత్వం చేసిందని మంత్రి గుర్తు చేశారు. నిపుణులు, ఎన్.డి.ఎస్.ఏ అందించిన నివేదిక ప్రకారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మత్తులు చేసి పునరుద్ధరణ చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం మంథని లోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ విద్యతో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని భావించిన స్వర్గీయ నాయకులు శ్రీపాద రావు ఇక్కడి గ్రామాలలో పాఠశాలలను ఏర్పాటు చేశారని, స్పీకర్ గా మంచి విలువలు నెలకొల్పారని, జవాబుదారీ తనతో పని చేశారని తెలిపారు.స్వర్గీయ శ్రీపాద రావు ఆశయాల సాధన మేరకు గతంలో మన ప్రభుత్వం హయాంలో జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంథనిలో సంగీత కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.మంథని మారుమూల ప్రాంతంలో సైతం బస్ డిపో ఏర్పాటు చేయడంలో, రోడ్లు లేని గ్రామాలకు కాలినడకన వెళ్లి అందుబాటులో ఉన్న వనరులతో అభివృద్ధి చేయడంలో శ్రీపాదరావు కీలక పాత్ర పోషించారని, ఆయన ఆశయాలను సంపూర్ణంగా పూర్తి చేసే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద లబ్దికి త్వరలో నాంది పలుకుతామని, పైరవీలకు తావులేకుండా అర్హులకు మాత్రమే లబ్ది చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు జారీ చేశామని, మెరిట్ విద్యార్థులకు మాత్రమే ఉద్యోగాలు లభిస్తాయని ఎటువంటి పైరవీలకు ఆస్కారం ఉండదని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో బాబా సాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఉచితంగా అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, టి.ఎస్. ఎన్.పి.డి.సి.ఎల్. ఎస్.ఈ. బి.సుదర్శన్, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వారణాసి నుంచి మళ్లీ మోడీ పోటీ

(మొదటి పేజీ తరువాయి)

దయ్యూ డామన్‌నుంచి ఒక్కో అభ్యర్థిని ప్రకటించారు.

**పోటీలో ఉన్న కేంద్రమంత్రులు**

గుజరాత్‌లోని గాంధీనగర్‌నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరోసారి లోక్‌సభకు పోటీ చేయనున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ యుపిలోని లక్నోనుంచి, స్మృతి ఇరానీ అమేథీ స్థానంనుంచి మరోసారి బరిలోకి దిగనున్నారు.ఢిల్లీలో నాలుగు చోట్ల అభ్యర్థులు రమేశ్ బిధూరి, పర్వేశ్ వర్మ, మీనాక్షి లేఖి, హర్షవర్ధన్‌లను తొలగించి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించారు. అలాగే భోపాల్‌లో ప్రగ్యాసింగ్ ఠాకూర్‌ను కూడా తప్పించారు. న్యూఢిల్లీ స్థానంనుంచి మాజీ కేంద్రమంత్రి దివంగత సుష్మాస్వరాజ్ కుమార్తె బన్సురి స్వరాజ్‌కు తొలిసారి అవకాశం కల్పించారు. కమల్‌జీత్ షెరావత్ పశ్చిమ ఢిల్లీనుంచి, చాందినీ చౌక్‌నుంచి ప్రవీణ్ ఖండేల్వాల్, ఎంఎల్‌ఎ రాంవీర్ సింగ్ బిధూరి దక్షిణ ఢిల్లీనుంచి పోటీ చేస్తారు. ఈశాన్య ఢిల్లీనుంచి మనోజ్ తివారీకి తిరిగి అవకాశం కల్పించారు. కాగా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విదిశనుంచి బరిలోకి దిగనున్నారు.లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా రాజస్థాన్‌లోని కోటనుంచి తిరిగి పోటీ చేస్తారు. కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా మధ్యప్రదేశ్‌లోని గుణనుంచి,అర్జున్ మేఘ్వాల్ బికనూర్‌నుంచి గజేంద్ర సింగ్ షెకావత్ జోధ్‌పూర్‌నుంచి పోటీ చేస్తారు. ప్రస్తుతం రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ గుజరాత్‌లోని పోరుబందర్‌నుంచి లోక్‌సభ బరిలో నిలవనున్నారు.అలాగే మరో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్( ప్రస్తుతం రాజ్యసభ)తిరువనంతపురంనుంచి పోటీ చేస్తారు. ప్రస్తుతం ఇక్కడ కాంగ్రెస్ నుంచి శశి థరూర్ ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక కిరెన్ రిజిజు అరుణాచల్‌ప్రదేశ్ వెస్ట్‌స్థానంనుంచి పోటీ చేస్తారు.అసోం మాజీ ముఖ్యమంత్రి శర్వానంద్ సోనోవాల్‌కు దిబ్రూగఢ్‌నుంచి అవకాశం కల్పించారు. ఇక సినీనటి హేమామాలిని యుపిలోని మథుర నుంచి, మలయాళ సినీనటుడు సురేశ్ గోపి కేరళలోని త్రిసూర్ నుంచి పోటీ చేస్తారు. ఆశ్చర్యకరంగా యుపిలోని తేనినుంచి కేంద్ర హోం శాఖ సహాయమంత్రి అజయ్ మిశ్రాకు మరోసారి అవకాశం కల్పించారు. ఆయన తనయుడు ఆశిష్ మిశ్రా 2021లో లఖింపూర్ ఖేరిలో ఆందోళన చేస్తున్న రైతులపైకి వాహనంతో దూసుకెళ్లి పలువురు మృతికి కారణమైన విషయం తెలిసిందే. ఈ ఘటన చర్చనీయాంశంగా మారడమే కాదు, తీవ్ర నిరసనలకు దారి తీయడం విదితమే. ప్రస్తుతం అజయ్ మిశ్రా జైలులో ఉన్నారు. వచ్చేవారం బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ మరోసారి భేటీ కానుంది. ఆసమావేశంలో మరిన్ని పేర్లపై స్పష్టత రానుంది.

# పారిశ్రామికవేత్తలకు తెలంగాణ భూతల స్వర్గం:ఉప ముఖ్యమంత్రి భట్టి



**హైదరాబాద్,మార్చి 2 :(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ పారిశ్రామిక వేత్తలకు తెలంగాణ రాష్ట్రం భూతల స్వర్గం అని తెలిపారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. దేశంలో ఎక్కడా లేని మౌలిక వసతుల కల్పనకు మంచి వాతావరణం తెలంగాణ రాష్ట్రంలో నెలకొందన్నారు. రకరకాల ప్రాంతాల నుంచి వచ్చి హైదరాబాదులో స్థిరపడి ఆరోగ్యాన్ని బాగు చేసుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ అంటేనే నా రాష్ట్రం.. నా ఊరు అన్న భావన ఇక్కడ కలుగుతుందన్నారు. ప్రపంచానికి అద్భుతమైన మానవ వనరులను అందిస్తున్నది తెలంగాణ రాష్ట్రం అన్నారు. హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో ఇవాళ జరిగిన సిఐఐ తెలంగాణ స్టేట్ అన్యువల్ మీటింగ్ 2023-24 కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే పారిశ్రామికవేత్తలకు కాంగ్రెస్ ప్రభుత్వం రాయితీలు ఇవ్వడంతో పాటు పూర్తి సహకారం అందించడానికి సంసిద్ధతగా ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యం లోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తుందన్నారు.

**మహిళలను మహాలక్ష్మిగా చూసే ప్రభుత్వం మాది..**

తెలంగాణలోని మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మిగా చూస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో మహాలక్ష్మి పథకం కింద మహిళలు అందిస్తున్న ఉచిత బస్సు రవాణాను ఇప్పటి వరకు 18.50 కోట్ల మంది మహిళలకు జీరో టికెట్స్ ఇచ్చామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కొత్త ఇండస్ట్రీ పార్కుల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలను తయారు చేస్తున్నామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు మా ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తుందన్నారు.

**డెయిరీ పరిశ్రమలు స్థాపించండి..**

రాష్ట్రంలో పాల ఉత్పత్తికి వినియోగం మధ్యన చాలా గ్యాప్ ఉందని, దీంతో డెయిరీ ని డెవలప్ కు తెలంగాణాలో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. స్వచ్ఛమైన పాలను అందించగలిగే విధంగా డెయిరీ ఇండస్ట్రీని ఏర్పాటు చేసుకుంటే భవిష్యత్తుకు మేలు చేసిన వారం అవుతామని తెలిపారు. అత్యధిక ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి అనువుగా ఉన్న చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు.

**వ్యవసాయ అనుబంధ సంస్థలకు ఉజ్వల భవిష్యత్ ..**

మొక్కజొన్న, టమాట, మిర్చి, పత్తి తదితర వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మేలు చేయడంతో పాటు ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించవచ్చని తెలిపారు. వాణిజ్య పంటల ఉత్పత్తి ద్వారా రైతులు ఆర్థికంగా బలపడటంతో పాటు పరిశ్రమల యజమానులు సైతం ఆదాయం పొందవచ్చన్నారు. గోదావరి కృష్ణ నదులను మూసీకి అనుసంధానం చేసి స్వచ్ఛమైన నీరు పారే విధంగా మూసీ ప్రక్షాళన చేయబోతున్నామన్నారు.

**మూసీనది పరివాహక ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి..**

మూసీ పరివాహక ప్రాంతంలో చెక్ డ్యామ్, చిల్డ్రన్ పార్క్, ఫ్లై ఓవర్స్, ఎంటర్టైన్మెంట్, బోటింగ్ తదితర ఎసెట్స్ ను పిపిపి మోడల్ లో అభివృద్ధి చేయనున్నామని భట్టి చెప్పారు. గత ప్రభుత్వ చర్యలతో మూసీ రివర్ డ్రైనేజీగా మారిందన్నారు. ఔటర్ రింగు రోడ్డు రీజనల్ రింగ్ రోడ్ మధ్యన అనేక క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ శివార్లలో గత ప్రభుత్వం 30 వేల ఎకరాల్లో ఫార్మాసిటీని ఒకే చోట ఏర్పాటు చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని రద్దుచేసి 3000ఎకరాల్లో అనేక చోట్ల ఫార్మా విలేజ్లు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

**గ్రానైట్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం..**

ఔటర్ రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్ మధ్యన టెక్స్టైల్ గ్రానైట్ ఐటి సెక్టార్ మైన్ తదితర క్లస్టర్లను ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. పెరిగిన ధరలతో హైదరాబాదులో సామాన్యులు పేద మధ్యతరగతి ప్రజలు ఇంటి స్థలం కొనే పరిస్థితి లేదన్నారు. గత ప్రభుత్వాలు హైదరాబాదులోని బర్కత్ పుర, ఎస్ ఆర్ నగర్, కూకట్ పల్లిలో హౌసింగ్ బోర్డ్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేసినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం శాటిలైట్ టౌన్ షిప్స్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

**విద్యావనరులు అధికంగా ఉన్న ఏకైక రాష్ట్రం ..**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉస్మానియా యూనివర్సిటీ ఐఐటి లాంటి విద్యాసంస్థలు మానవవనరులను హైదరాబాదులో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. హైదరాబాదుకు మణి హారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, పరిశ్రమలకు కావలసినంత భూమి తెలంగాణలో అందుబాటులో ఉందన్నారు. హైదరాబాదు నగర రాజ్యాంగ అభివృద్ధి చెందుతుందన్నారు. హైదరాబాదును మిగతా జిల్లాలతో కలుపుతూ రీజనల్ రింగ్ రోడ్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు.

# దుద్దిళ్ల ఎప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారు





**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 2(పిసిడబ్ల్యూ న్యూస్):**ఎన్నో పదవి బాధ్యతలు నిర్వర్తించి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాలను అందించిన మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తదితరులతో కలిసి డాక్టర్ బండా ప్రకాష్ మాజీ స్పీకర్ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తన నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించడంతో పాటు ప్రజలకు అనేక సేవలను అందించారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభ స్పీకర్ గా పనిచేయడం గొప్ప విషయమని, శాసనసభను నడిపించడంలో స్పీకర్ గా శ్రీపాదరావు హుందాగా వ్యవహరించారని పేర్కొన్నారు. మాజీ స్పీకర్ శ్రీపాదరావు మానవతా విలువలో ఉన్న గొప్ప వ్యక్తి అని అన్నారు. గొప్ప వ్యక్తిగా చరిత్రలో నిలిచారని, ఆయన అందించిన సేవలను స్మరించుకోవడం సముచితమన్నారు. శ్రీపాద రావు కు ఉమ్మడి వరంగల్ జిల్లాతో అనుబంధం ఉందని, గతంలో తనకు కూడా వారితో కలిసి కొన్నిసార్లు పని చేసే అవకాశం కలిగిందన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దుద్దిళ్ల శ్రీపాదరావు సర్పంచిగా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి, ఎన్నో పదవి బాధ్యతలను చేపట్టి ఆదర్శప్రాయంగా నిలిచారని అన్నారు. రాజకీయ విలువలను కాపాడిన గొప్ప వ్యక్తి శ్రీపాదరావు అని పేర్కొన్నారు. ఆయన తనయుడైన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిత్యం ప్రజలలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ ప్రజలకు గుర్తుండిపోయేలా శ్రీపాదరావు సేవలు చేశారని అన్నారు. అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, స్పీకర్ గా శ్రీపాదరావు ఆదర్శంగా నిలిచారని ఉన్నారు. వారు అందించిన సేవలు ఆదర్శనీయంగా నిలిచాయన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కళాకారులు శ్రీపాదరావు అందించిన సేవలను గుర్తు చేస్తూ పాటలు పాడి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగారలే, డిఆర్ఓ వై.వి. గణేష్, డిఆర్డిఓ నాగ పద్మజ, జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్ రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డీఎస్ఓ వసంతలక్ష్మి, అగ్రికల్చర్ జేడి రవీందర్ సింగ్, బీసీ వెల్ఫేర్ డిడి రామ్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహా శివరాత్రి జాతర బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ



**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 2(పిసిడబ్ల్యూ న్యూస్):**గ్రేటర్ వరంగల్ లోని వేయి స్థంబాల గుడిలో శ్రీ రుద్రేశ్వర స్వామి శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఈ నెల 7 వ తేది నుండి 11 వ తేది వరకూ వేయి స్థంబాల గుడిలో జరిగే శ్రీ రుద్రేశ్వర స్వామి మాహా శివరాత్రి బ్రహ్మోత్సవాల గోడ పత్రికను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా రుద్రేశ్వర స్వామి మాహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యరమంలో ఆలయ అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, కార్పోరేటర్ తోట వెంకటేశ్వర్లు, హన్మకొండ ఏ.సి.పి దేవేందర్ రెడ్డి, డివిజన్ అద్యక్షుడు ఎస్. కుమార్ యాదవ్, మాడిశెట్టి రాజ్ కుమార్, మాడి శెట్టి సతీష్, హన్మకొండ సి.ఐ. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## శక్తి సూపర్ షి పోస్టర్ ఆవిష్కరించిన మాజీ డిసిసిబి చైర్మన్ రాఘవరెడ్డి




**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 2(పిసిడబ్ల్యూ న్యూస్):**గ్రేటర్ వరంగల్ హంటర్ రోడ్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మహిళా విభాగమైన 'శక్తి సూపర్ షి" కి సంబంధించిన పోస్టర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ డిసిసిబి చైర్మన్ జంగా రాఘవ రెడ్డి పాల్గొని శక్తి సూపర్ షి గోడ పోస్టర్ ను ఆవిష్కరించారు. బావి భారత ప్రధాని రాహుల్ గాంధీ యొక్క ఆలోచనలకు రూపుదాలుస్తూ ఏర్పడిన యువజన కాంగ్రెస్ మహిళా విభాగం శక్తి సూపర్ షి మహిళలు రాజకీయాల్లో రాణించాలని, అలాగే మహిళా మణులు స్వయం శక్తితో ముందుకు రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లాశక్తి సూపర్ షి కో-ఆర్డినేటర్ గోవిందు శ్వేత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మధుమేహ వ్యాధి ఉన్నవారు ఆహార అలవాట్ల పై అవగాహన కలిగి ఉండాలి

### - డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు




**హనుమకొండ, మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** మధుమేహ వ్యాధి ఉన్న వారు తినే ఆహార విషయం మరియు మధుమేహ సంభందిత విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలి. దాని కొరకు ప్రతి నెల మొదటి ఆదివారం రోజు కేర్ డయాబెటిస్ సెంటర్ లో డయాబెటిస్ ఎగ్జిబిషన్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు డాక్టర్.సాయిని వెంకటేశ్వర్లు తెలిపారు . మధుమేహం ఉన్నవారు కొన్ని జాగ్రత్తలతో సామాన్య జీవితాన్ని గడపవచ్చు అని అన్నారు.మధుమేహం వ్యాధి ఉన్నవారు వారికి ఆహారపు అలవాట్ల పై అవగాహనా అనేది చికిత్స లో భాగమని తెలిపారు.మధుమేహం పై అవగాహనా కలిపించాలి అనే ఉద్దేశంతో ఈ ఎక్సిబిషన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.ఈ ఎక్సిబిషన్లో డయాబెటిస్ ఉన్నవారికి డైటీషన్ ద్వారా అవగాహనా, డెమో నిర్వహించడం తో పాటు ఫీజియోథెరపిస్ట్ తో వ్యాయామం గురించి వివరించడం జరుగుతుందన్నారు. .ఈ ఎక్సిబిషన్ లో పాల్గొనే ప్రజలకి డయాబెటిస్ సంబంధిత పరీక్షల పై 20 శాతం డిస్కౌంట్ తో పాటు ఉచితంగా కిడ్నీ పరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహిస్తామని నిర్వాహకులు డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు తెలిపారు.

## రెవెన్యూ డివిజన్ పరిధిలో ట్రిబ్యునల్లు ఏర్పాటు చేయాలి



**పరకాల, మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):**తల్లిదండ్రులు వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం 2007ను పురస్కరించుకొని చట్టపరంగా చర్యలు తీసుకుని వయోవృద్ధులకు అండగా నిలవాలని కోరుతూ పరకాల ఆర్డిఓ సత్యనారాయణకు వయవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మార్చి 4 సోమవారం జరిగే బయోవృద్ధుల అవగాహన సదస్సుకు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరుతూ ప్రచురించిన కరపత్రాన్ని ఆర్డిఓ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరకాల వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రేపాల నరసింహా రాములు మాట్లాడుతూ వయోవృద్ధుల సమస్యల పట్ల వచ్చేటటువంటి ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఆర్డిఓ పరిధిలో ట్రిబ్యునల్ ని ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు బూసి ప్రభాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కోడెపాక సమ్మయ్య ట్రెజరర్ ఎడ్ల సుధాకర్ ప్రచార కార్యదర్శి సుంకర రామన్న సహాయ కార్యదర్శులు బాణాల మొగులయ్య పోరండ్ల కైలాసం రాఘవరెడ్డి ముదురుకోళ్ల సంపత్ పాల్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు ఐఐహెచ్‌టి మంజూరు చేసిన కేంద్రం: మంత్రి తుమ్మల



**హైదరాబాద్,మార్చి 2 (పీసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టి)సంస్థను మంజూరు చేసిందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జౌళిశాఖ కార్యదర్శి ఇటీవల తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పుడు ప్రత్యేకంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి డిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి పియూష గోయల్‌ను కలిసి త్వరితగతిన ఐఐహెచ్‌టని తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. తదుపరి కార్యాచరణ వల్ల కేంద్ర ప్రభుత్వం శుక్రవారం నాడు తెలంగాణ రాష్టానికి ఐఐహెచ్‌టిని మంజూరుచేసిందని తెలిపారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థను తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ రాష్ట్రంలోని విధ్యార్థులు స్వరాష్ట్రంలోనే టెక్నికల్ డిగ్రీ, డిప్లొమాలను పొందడానికి అవకాశం ఏర్పడిందన్నారు. గతంలో ఇక్కడీ విధ్యార్థులు ఆంధ్ర ,ఒరిస్సాలకు వేలాల్సిన పరిస్థితి ఉండేదన్నారు.ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో రెగ్యులర్ శిక్షణలతో పాటు టెక్నికల్ టెక్స్ టైల్స్ సంబంధించిన చదువులు, టెక్స్ టైల్స్ డిజైనింగ్, అప్పారల్స్ డిజైనింగ్, మార్కెటింగ్ , ఇంటర్నేషనల్ ట్రేడ్ లాంటి విషయాలలో బోధనలు అందించడం జరుగుతుందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో టిటాప్ పాలసీ (జౌళిశాఖ ఇండస్ట్రీయల్ పాలసీ) వల్ల దేశీయంగానే కాకుండా, అంతర్జాతీయ పరిశ్రమలు రావటం జరుగుతుందన్నారు. ఈ పరిశ్రమలలో నైపుణ్యం కలిగిన వ్యక్తులు ఎక్కువ మంది అవసరం ఉంటుందని తెలిపారు. ఐఐహెచ్‌టి ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ విధ్యార్థులకు ఉపాధి పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. సాంకేతిక నైపుణ్యం కలిగిన విధ్యార్థులు మన రాష్ట్రంలో తయారు కావడం వల్ల జౌళి పరిశ్రమలో అంతర్జాతీయ స్థాయికి తగిన అభివృద్ధికి తీసుకెళ్లాడానికి వీలవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## అనుమతి లేకుండా నడిపిస్తున్న అవినాష్ డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి..!

### - పిడిఎస్యు, ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల సంఘాల డిమాండ్

**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 2(పిసిడబ్ల్యూ న్యూస్):**శనివారం పిడిఎస్యు ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అనుమతి లేకుండా నడిపిస్తున్న అవినాష్ డిగ్రీ కళాశాల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ..కాకతీయ యూనివర్సిటీ రిజిస్టర్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి వెంకటరెడ్డి, ఏఐఎస్ఎఫ్ అఖిల భారత విద్య సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా హనుమకొండ నగరంలో అవినాష్ డిగ్రీ కళాశాలకు పరమతులు లేవని, ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఒకే బిల్డింగ్ లో జూనియర్, డిగ్రీ కళాశాలను నడిపిస్తుంటే, ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే అవినాష్ కాలేజీ పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రంజిత్,మహేష్,పవన్, రవితేజ, చరణ్, విద్యార్థి సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి పోలీస్ స్టేషన్లో వృద్ధ మిత్ర కమిటీలు పెట్టాలి

**పరకాల, మార్చి 2 (పీసిడబ్ల్యూ న్యూస్):**పరకాల సిఐని కలిసిన వయోవృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు పరకాల స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా నూతనంగా విధుల్లోకి చేరిన సిఐ రవిరాజును పరకాల వయోవృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రేపల్లె నరసింహారావు మాట్లాడుతూ వృద్ధులకు ఎదురైన సమస్యలతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయుటకు వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా పోలీస్ స్టేషన్లో పరిధిలో వృద్ధ మిత్ర కమిటీలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా సిఐని శాలువాతో సన్మానించి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు బూసి ప్రభాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కోడెపాక సమ్మయ్య ట్రెజరర్ సుధాకర్ ప్రచార కార్యదర్శి ఎస్ రామన్న లతో పోరండ్ల కైలాసం బాణాల మొగిలి టీ పాల్ రేగురి రాఘవరెడ్డి పిట్ట వీరస్వామిలు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందజేసిన తుడి లచ్చన్న



**గంగాధర, మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):**కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం షానగర్ గ్రామానికి చెందిన జంగిలి శ్రీనివాస్ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యం తో మృతి చెందిన విషయం తెలుసుకున్న గంగాధర మండలం మల్లాపూర్ గ్రామం సామాజిక వేత్త తూడి లచ్చన్న గారు వీరి కుటుంబాన్ని పరామర్శించి 10,000/-పది వేయిల రూపాయల ఆర్థిక సహాయం చేసారు కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థులు లచ్చన్నకీ కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో లచ్చన్న యువసేన సభ్యులు. శానగర్ నాయకులు ,సైండ్ల కరుణాకర్, గునుకొండ అశోక్ ,చెట్టి మహేందర్,పుల్కమ్ రాజమల్లు,పెంటి శంకర్,మన్నే కిషన్ చందర్,సయిండ్ల నర్సింగమ్,సైండ్ల మల్లారెడ్డి ,గ్రామ యువకులు నాయకులు పాల్గొన్నారు.

## సిసి రోడ్, సైడ్ కాలువను ప్రారంభించిన కౌన్సిలర్



**పరకాల, మార్చి 2 (పీసిడబ్ల్యూ న్యూస్):**పరకాల పట్టణంలోని 16 వార్డులో నూతనంగా సిసి రోడ్డు మరియు సైడు కాలువలకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభం చేసిన 16వ వార్డ్ కౌన్సిలర్ బండి రమాదేవి సారంగపాణి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, కుంకుమేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ గందే వెంకటేశ్వర్లు, టిఆర్ఎస్ నాయకులు బండి శ్రీనివాస్ .ఎండి యాకుబ్ . సురేష్. శ్రీధర్ రాజ్. పాల్గొన్నారు.

## దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుల్లో పీవీ నరసింహారావు ఒకరు: ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్,మార్చి 2 (పీసిడబ్ల్యూ న్యూస్):** దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుల్లో మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహా రావు ఒకరని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇటీవల పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించిన సందర్భంగా శనివారం బేగంపేటలోని పీవీ నర్సింహారావు భవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పీవీ ఫోటో ప్రదర్శనను ప్రారంభించారు.ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పీవీ నర్సింహా రావు కు భారతరత్న ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా లభించిన గౌరవం భారతరత్న అని పేర్కొన్నారు. మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా ఎంతో విశేషమైన సేవలు అందించారని గుర్తుచేశారు. ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ఘనత పీవీకే దక్కుతుందన్నారు.తన పరిపాలన దక్షతతో ప్రపంచ దేశాలలో భారతదేశ ఖ్యాతిని చాటి చెప్పారని, అలాంటి మహనీయుడికి భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ అనేక సార్లు డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వానిదేవి, కుమారుడు ప్రభాకర్ రావు, కార్పొరేటర్ టి.మహేశ్వరి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.




# ములుగు జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలి

**- కబడ్డీ క్రీడాకారుల టీషర్ట్స్ ఆవిష్కరించిన మానుకోట సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్**



**ములుగు జిల్లా,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా కేంద్రంలోని జే ఎన్ ఎస్ స్టేడియంలో క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటాలని మానుకోట సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు ఈ నెల 2 నుండి 4 వరకు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ లో జరిగే 70వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ కబడ్డీ పోటీలలో పాల్గొనే ములుగు జిల్లా క్రీడాకారుల టీషర్ట్స్ శనివారం హన్మకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఇంచార్జి డివైఎస్ఓ తుల రవితో కలిసి తస్లీమా మహమ్మద్ గారు ఆవిష్కరించారు తదుపరి క్రీడాకారులను ఉద్దేశించి తస్లీమా మహమ్మద్ గారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో రాణించాలని పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చి జిల్లాకు మరియు కోర్టులకు కన్న తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని తస్లీమా మహమ్మద్ గారు అన్నారు ఈ కార్యక్రమంలో ఇంచార్జి డివైఎస్ఓ తుల రవి మంగపేట మండల్ ఎంపీడీవో సుదర్శన్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ జనార్ధన్ బాక్సింగ్ కోచ్ మామిడిపెల్లి రమేష్ మరియు క్రీడాకారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## 12న హైదరాబాద్‌లో ఉద్యమకారుల కృతజ్ఞత సభ





**పెద్దపల్లి జిల్లా, ఓదెల,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):**పెద్దపల్లి జిల్లా ఓదెల మండల ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 12న మంగళవారం రోజున హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ అధ్యక్షతన గౌరవనీయులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞత సభ ఏర్పాటు చేయడం జరిగిందని, కావున జిల్లాలోని ఉద్యమకారులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.స్వరాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను త్యాగం చేసి రాష్ట్రం వచ్చిన తర్వాత అన్యాయానికి గురైన ఉద్యమకారులకు న్యాయం చేస్తామని ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం 250 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చి ఉద్యమకారుల ఆత్మ గౌరవాన్ని నిలబెడతామని చెప్పడం పట్ల ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఉద్యమకారులకు రానున్న రోజుల్లో అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి తెలంగాణ ఉద్యమకారునికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని అన్నారు.హైదరాబాద్ కు తరలివచ్చి సదస్సు విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ముద్దామాళ్ళ రమేష్, కాంతాల సమ్మిరెడ్డి,పెద్దిరెడ్డి రాజిరెడ్డి, గాజుల శివశంకర్, అలిగివెల్లి రవీందరరెడ్డి,కర్రె లక్ష్మారెడ్డి,పాల్కలా కర్ణాకర్ రెడ్డి,తుమ్మల కొండయ్య, మాచర్ల రవీందర్,చింతకుంట వెంకటరెడ్డి,లింగాల జనార్దన్ రెడ్డి,జీలుల సంతోష్, పంజలా తిరుపతి,కొత్తిరెడ్డి మల్లారెడ్డి,పెరుమాండ్ల ఐలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 3న ఖమ్మంలో జరిగే మాస్ లైన్ మహా ప్రజాప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయండి: బందెల వెంకయ్య పిలుపు



**ఖమ్మం, మార్చి 02(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా,పిసిసి సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ ఆర్ఐ ఐక్యమై సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) ఆలిం డియా యూనిటీ మహాసభలు బహిరంగ సభ, ప్రజా ప్రదర్శన మార్చి 3,4,5వ తేదీలలో ఖమ్మంలో జరుగుతున్నాయని మహిళలు, ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ మాసులైన ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య పిలుపునిచ్చా రు. శుక్రవారం ఎం వెంకటయ్య పాలెం గ్రామంలో మహిళలతో జనరల్ బాడీ నిర్వహించడం జరిగింది. ఈ జనరల్ బాడీ సమావేశానికి బందెల వెంకయ్య హాజరై మాట్లాడుతూ, దేశంలో చారిత్రాత్మకంగా మూడు విప్లవ పార్టీలు ఐక్యం కావటం విప్లవ శ్రేణిలో నూతన ఉత్తేజం నెలకొని ఉన్నదని, భవిష్యత్తులో అన్ని విప్లవ పార్టీలు ఐక్యంగా ముందుకు సాగుతూ విప్లవాన్ని జయప్రదం చేసి ప్రజల యొక్క సమస్యలను పరిష్కరించాల్సిన విప్లవపార్టీల ముందు ఉన్నదని ఆయన పిలుపునిచ్చారు. మార్చి 3న ఖమ్మం లో జరిగే బహిరంగ సభలో వేలాదిమంది కళాకారులతోటి కళారూపాలు ఉంటాయని,వేలాది మంది ప్రజలతో ప్రజాప్రదర్శన జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీ ల మహిళా సంఘం నాయకులు శీలం పూలమ్మ, స్వప్న ఏసమ్మ పార్టీ నాయకులు కందుల మంగయ్య కోట రామలింగం,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియజేసిన సెర్ఫ్ ఉద్యోగులు



**ఖమ్మం,మార్చి 01(పి సి డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** తెలంగాణ టిజిఓ గెజిటెడ్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావుని తెలంగాణ గ్రామీణాభివృద్ధిసంస్థ సంక్షేమ సంఘం(సెర్ఫ్) ఖమ్మం ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలసిన పుష్పగుచ్చం అందజేసినారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా సెర్ఫ్ ఉద్యోగులు శనివారం ఏలూరు శ్రీనివాసరావుని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉద్యోగుల సమస్య లను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటె తన ద్రుష్టికి తీసుకురావాలన్నారు. గత తెలంగాణ ప్రభుత్వం పే స్కెల్ ఇచ్చినప్పటికీ ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని ఉద్యోగులు అయన ద్రుష్టికీ తీసుకోని వెళ్ళారు. త్వరలో ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహిస్తాం అని మీకు అండగా టిజీఓ ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు బూరుగు అనురాదా, జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల నాగేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు నంచర్ల అజయ్ బాబు, నంద్రు నవీన్ బాబు, జిల్లా నాయకులు పంబ శ్రీనివాసరావు, తడికమళ్ళ నాగేశ్వరావు, రామా రావు, మోదుగు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ రైస్ డెలివరీ ప్రతి మిల్లు నుంచి సేకరించాలి

**- పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్**



**పెద్దపల్లి జిల్లా,మార్చి 02: (పిసిడబ్ల్యూ న్యూస్):**2023-24 వానాకాలం పంటకు సంబంధించి నిర్దేశిత సీఎంఆర్ రైస్ డెలివరీ ప్రతి మిల్లర్ దగ్గర నుంచి రాబట్టుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు.శనివారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో 2022-23 యాసంగి సీఎంఆర్ రైస్ బకాయిల వసూలు, 2023-24 వానాకాలం పంట రైస్ మిల్లర్ల నుంచి రాబట్టుకోవాల్సిన సిఎంఆర్ రైస్ బకాయిలు ప్రభుత్వానికి అందజేయడానికి అవలంబించాల్సిన విధానం ఎన్ఫోర్స్మెంట్ స్టాఫ్ తో సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో ప్రతి రైస్ మిల్లర్ల దగ్గర నుంచి ప్రతి రోజు వారి మిల్లింగ్ కెపాసిటీ బట్టి సీఎంఆర్ డెలివరీ చేయాలని, అలా చేయని మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరించి వారి వద్ద ఉన్న ధాన్యాన్ని సక్రమంగా నడిపిస్తున్న మిల్లుకి షిఫ్టింగ్ చేయాలని ఆదేశించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ పట్ల జాగ్రత్తగా వ్యవహరించి రేషన్ దుకాణాల ద్వారా పేదలకు బియ్యాన్ని సరఫరా చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ సంబంధించిన బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా దారి మళ్లిస్తే వారి పట్ల కూడా కఠినంగా వ్యవహరించి కేసులు పెట్టాలని ఆదేశించారు.ఎన్ఫోర్స్మెంట్ స్టాఫ్ విధిగా వారి బాధ్యతలు నిర్వహించి నియమబద్ధంగా టూర్ డైరీ సమర్పించి వారి టార్గెట్ ప్రకారంగా రైస్ మిల్లుల్ని , రేషన్ షాపుల్ని తనిఖీ చేసి ప్రజా పంపిణీ వ్యవస్థని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఫైనాన్స్ మెంబర్‌ని కలిసిన కాంగ్రెస్ డోర్నకల్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గుగులోత్ నవీన్



**సిరోలు,మార్చి 02: (పిసిడబ్ల్యూ న్యూస్):** : మండలం హాట్యాతండలో నెహ్రూ నాయక్ నివాసంలో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ మెంబర్ గా ఇటీవలే నూతన బాధ్యతలు చేపట్టిన మాలోత్ నెహ్రూ నాయక్ కలిసి శాలువతో సన్మానం చేసి శుభాకాంక్షలు తేలియజేసారు.ఈ సందర్భంగా నెహ్రూ నాయక్ మాట్లాడుతూ నన్ను ఇంతలా అభిమానించే వారికి రుణపడి ఉంటా తెలంగాణ లో గ్రామలు అభివృద్ధికి బాటలు వేసె పనిలో ఉంటా అని అన్నారు అదేవిధంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కష్ట పడి పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పార్టీ కోసం పని చేసిన వారికి తప్పకుండా ఫలితం ఉంటుంది అని ఆయన తెలిపారు.

# స్పందనకు వందనం...!


**- మంత్రి పొంగులేటి ఔదార్యానికి కృతజ్ఞతలు తెలుపుకున్న బాధితుడు**





ఖమ్మం, మార్చి 01(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) : సరిగ్గా రెండు నెలల క్రితం (జనవరి 2న) తిరుమలాయపాలెంలో ప్రజాపాలన సభ ముగించుకుని మంత్రి పొంగులేటి ఖమ్మం వస్తున్న సమయంలో ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి వద్ద వరంగల్ - ఖమ్మం ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. గమనించిన మంత్రి హుటాహుటిన తన కాన్వాయ్ ను ఆపి ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తికి ధైర్యం చెప్పారు. అనంతరం 108 ద్వారా ఖమ్మంలోని తన కిమ్స్ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించేందుకు చొరవ చూపారు. ప్రస్తుతం తీవ్రగాయాల బారి నుంచి కోలుకున్న ఆ వ్యక్తి కుటుంబ సమేతంగా రెండు రోజుల క్రితం ఖమ్మం పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి తన పట్ల చూపిన ఔదార్యానికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఆరోగ్యం సరిగ్గా చూసుకోవాలని బాధితుడికి మంత్రి పొంగులేటి సూచించారు. ఎల్లవేళలా ఆపదలో అండగా ఉంటాననే భరోసా కూడా ఇచ్చారు.

## సింగిల్ విండో చైర్మన్‌గా ఎన్నికైన చెన్నగోని అంజయ్య గౌడ్‌నీ సన్మానించిన ప్రజల మనిషి రాజన్న



**నల్గొండ, మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి ప్రధాత శాసన సభ్యులు గౌరవ శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో చౌటుప్పల మండలం కేంద్రం సింగిల్ విండో చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన చెన్నగోని అంజయ్య గౌడ్ నీ సన్మానించారు మున్సిపల్ చైర్మన్ శ్రీ వెన్ రెడ్డి రాజు . ఈ కార్యక్రమంలో నాయకులు వైస్ ఎంపిపి ఉప్పు భద్రయ్య,ఆకుల ఇంద్రసేన రెడ్డి, బోయ దేవేందర్,సుర్వి నరసింహ,పబ్బు రాజు, ఉబ్బు వెంకటయ్య, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ కొయ్యడ సైదులు, బొబ్బిళ్ళ మురళి, మొగుదాల రమేష్, రావుల స్వామి, అంతటి బాలరాజు,సందగల్ల సతీష్,తడక కిరణ్,ఆవుల యేసు,చింతల సాయిలు, ఎజాస్, కొండూరు వెంకన్న, గుండు మల్లయ్య, తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత విద్యుత్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





**గంగాధర,మార్చి 01(పి సి డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్‌లో మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం పని చేస్తోంది.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 6 గ్యారంటీలను అమలు చేస్తామని హైదరాబాద్ వేదికగా యూపీఏ చైర్పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ గారు హామీ ఇచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డి గారు వేదిక నుండి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ప్రయాణం, 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు.మార్చి 1వ తేదీ నుండి రాష్ట్రంలోని 40 లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు చేకూర్చే విధంగా గృహ జ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు విద్యుత్ ను ముఖ్యమంత్రి గారు ప్రారంభించారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో ఉచిత విద్యుత్ లో భాగంగా జీరో బిల్ జారీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించాం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమపాలలో నడుస్తోంది.ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేసితీరుతుంది.కార్యక్రమంలో జడ్పిటిసి పుల్కం అనురాధ -నర్సయ్య, గంగాధర సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమళ్ళ మనోహర్, నాయకులు బండపల్లి యాదగిరి, కర్ర విద్యాసాగర్ రెడ్డి, గుజ్జుల బాపురెడ్డి, సాగి అజయ్ రావు, రామిడి రాజిరెడ్డి, బట్టు లక్ష్మీనారాయణ, రోమాల రమేష్, వొడ్నాల యగ్నేష్, కొలిపాక స్వామి, దూలం వీరేశం గౌడ్, బెజ్జంకి కళ్యాణ్, కోల ప్రభాకర్, బైరిశెట్టి సంపత్, దాతు అంజి, పెంచాలా చందు,విద్యుత్ శాఖ అధికారులు ఈఈ రాజు చౌహన్, ఎస్ఈ గంగాధర్, డిఈ తిరుపతి, ఏడి ఈ సత్యనారాయణ రెడ్డి, ఎఈ తిరుపతి, ఎస్ ఏ ఓ రాజేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఐదు ప్రభుత్వ కొలువులు సాధించిన మమత



**పెగడపల్లి, మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):**కష్టపడితే సాధించలేనిది ఏది లేదనేందుకు నిదర్శనం మమత ఏకకాలంలో ఐదు ప్రభుత్వ కొలువులు సాధించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని ల్యాగలమర్రి గ్రామానికి చెందిన పుప్పాల రమ- భూమయ్య కూతురు మమత నిరుపేద కుటుంబంలో పుట్టింది. మమత పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివింది. డిగ్రీ కరీంనగర్ లో, పీజీ ఎంకమ్, బీఈడీ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు.నిరుపేద కుటుంబానికి చెందిన మమతను వారి తల్లిదండ్రులు వ్యవసాయ కూలి పనులు చేస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదురైన ఉన్నత చదువులు చదివించారు. చదువుపై మమతకున్న మమకారాన్ని వదులుకోలేక ఎన్నో ఇబ్బందులు కష్టాలు ఎదుర్కొని సిరిసిల్ల జిల్లా గురుకుల డిగ్రీ కళాశాలలో మూడు సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిన కామర్స్ డిగ్రీ లెక్చరర్ గా పనిచేస్తూనే నిత్యం సాధన చేశారు. ప్రభుత్వం నిర్వహించిన పలు కొలువుల పరీక్షలు రాశారు. ఏకకాలంలో గురుకుల డిగ్రీ లెక్చరర్ డిఎల్ 16వ ర్యాంకు, జూనియర్ లెక్చరర్ జేఎల్ స్టేట్ 6వ ర్యాంకు, మున్సిపల్ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జేఏవో బాసర జోన్ 1వ ర్యాంకు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ పీజీటీ, ట్రైనీ గ్రాడ్యుయేట్ టీచర్ టీజీటీ ఉద్యోగాలు సాధించారు. నేటి పోటీ ప్రపంచంలో సర్కార్ కొలువు ఒకటి సాధించడమే కష్టం ఈ పరిస్థితుల్లో ఏకంగా ఐదు కొలువులు సాధించి నేటి యువతకు మమత ఆదర్శంగా నిలిచారు. ఐదు ప్రభుత్వ కొలువులు సాధించిన మమతను పలు ప్రజా సంఘాల నాయకులు ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు అభినందించారు.

# ఒకేరోజు రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పెండ్లి స్రవంతి





**సంగెం, మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ రిక్రూట్మెంట్ బోర్డు శుక్రవారం రాత్రి ప్రకటించిన ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ ఫలితాలలో మొండ్రాయి గ్రామంలోని పెండ్లి రాములు- రామనీల దంపతుల ఏకైక కుమార్తె పెండ్లి స్రవంతి ఇంగ్లీష్, సోషల్ స్టడీస్ ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ గా ఒకే రోజు రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది.స్రవంతి మాట్లాడుతూ ఒకే రోజు రెండు ఉద్యోగాలు వస్తాయని అనుకోలేదని ఈ విజయానికి కారణం నా భర్త పెంతాల నవీన్ అని ఆమె అన్నారు .నన్ను ఎల్లప్పుడూ వెన్నంటి ప్రోత్సహించి, ఇచ్చిన సలహాలు, ధైర్యం వలనే ఈ విజయం సాధ్యం అయింది అన్నారు.అలాగే నాకు సపోర్ట్ చేసిన అమ్మా నాన్న,అత్త మామయ్యలకు,కుటుంబ సభ్యులకు,బంధువులకు కృతజ్ఞతలు,ధన్యవాదములు తెలిపింది.ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు,బంధువులు స్రవంతికి శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళలకు ట్రస్టు ద్వారా చీరల పంపిణీ



**తొర్రూర్,మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** చీరలు అంటే మహిళలకు ఎంతో ఇష్టం. గతంలో బతుకమ్మ పండుగ వచ్చినప్పుడు చీరల పంపిణీ కొనసాగేది. ఈ చీరలు కూడా ఎన్నికలకు ముందే పంపిణీ చేయాల్సి ఉండగా కొన్ని అవాంతరాలు వచ్చి చీరల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయింది.పాలకుర్తి నియోజకవర్గం ప్రజలంటే ఎన లేని ప్రేమ వీరికి వేల మందికి అన్నదానం చేసిన ప్రేమ మూర్తులు ,మన నియోజకవర్గానికి ఇంత చక్కని మనసున్న దంపతులు దొరకటం ఎంతో అదృష్టంగా భావించవచ్చు.వారెవరో కాదు మన తెలంగాణ రాష్ట్రంలోని పుట్టి పెరిగి చిన్ననాటి నుండి పేదలు పడుతున్న కష్టాలను చూసి కూడా మనకెందుకులే అనుకోకుండా ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో మనకు అండగా నిలిచిన పుణ్య దంపతులు వీరే నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పెరమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు. వీరితోపాటు మంచి మనసున్న దయా మూర్తి మన నియోజకవర్గ ప్రజల కోసం అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాలను సారం మహిళా ట్రస్టు ద్వారా నియోజకవర్గంలోని మండలాలలో చీరల పంపిణీ చేసిశనివారం తొర్రూర్ మండలంలోని అన్ని గ్రామాలలో పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో చీరల పంపిణీ కొరకు గ్రామ పార్టీ అధ్యక్షులకు అప్పగించారు. గుర్తూర్లో పాల్గొన్న వారిలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల రంగయ్య ,స్థానిక నాయకులు మన్మోహన్ రెడ్డి , పంజాలఅశోక్ ,దేవరకొండ శీను, మెరుగు మల్లేష్ మహిళా బృందం తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం



**మొగుళ్ళపల్లి,మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):**రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటి పథకాలను, దశల వారీగా అమలు చేస్తున్నందుకు. కాంగ్రెస్ పార్టీ మొగుల్లపల్లి టౌన్ అధ్యక్షులు క్యాతారాజు రమేష్ ఆధ్వర్యంలో. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భూపాలపల్లి. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కల్లపల్లి రాజు మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అతి తక్కువ సమయంలోనే ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలలో నాలుగు హామీలను నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందని కొనియాడారు. గతంలో తెలంగాణ ప్రజలను హామీల పేరుతో మోసం చేసి గద్దినెక్కిన గత ముఖ్యమంత్రి ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదని, ధనిక రాష్ట్రమైన తెలంగాణని అప్పులకుప్పగా మార్చిన ఘనత గత ప్రభుత్వ పాలకులదైతే, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశంలోనే అన్ని విధాలుగా ముందంజలో ఉంచేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని. ముఖ్యమంత్రి త్వరలోనే మిగిలిన రెండు హామీలను కూడా నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడుబండి సుదర్శన్ గౌడ్, ఎండి రఫీ. రక్తాని గోపాల్ రావు, బండారి కొమురయ్య, గాజుల పర్శరాములు, పెంతల మధుకర్, ఏకాంబ రామారావు, తిప్పారపు యుగంధర్, చంద్రారెడ్డి , దొమ్మటి ఓదెలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీరి వ్యవహారంపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి

### - ఇష్టారాజ్యంగా కొనసాగిస్తున్న అంగన్వాడి సిడిపిఓ సూపర్వైజర్





**తొర్రూర్, మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంగన్వాడి ఆయా పనిచేసేది ఒక సెంటర్ అయితే వేతనం తీసుకునేది మరొక సెంటర్. 15 సంవత్సరాలుగా ఒకే సెంటర్లో పనిచేసిన ఆయాను వేరే సెంటర్ లో పనిచేస్తున్న వైనం ఇది సిడిపిఓ సూపర్వైజరును పాత్రికేయులు వివరణ కోరగా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. తొర్రూర్ పట్టణ కేంద్రంలో భరత్ సింగ్ నగర్ అంగన్వాడి సెంటర్లో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆయాలు వేరే సెంటర్ కు మార్చారని సిడిపిఓ ఇష్ట రాజ్యాంగ వ్యవహరించటం సరైంది కాదని అంగన్వాడి టీచర్ సుకన్య ఆవేదన వ్యక్తం చేశారు .ఆయా మరియుసూపర్వైజర్ ఒక్కటై ఇబ్బందులకు గురిచేస్తున్నారని సుకన్య పత్రికల వారి ముందు ఆరోపించారు. ఆయాను వేరే సెంటర్లో పనిచేస్తూ వేతనం తన సెంటర్లో పనిచేస్తున్నట్టుగా ఇవ్వడం ఈ విషయంపై సూపర్వైజర్ను అడిగినప్పటికీ పట్టించుకోవడంలేదని అన్నారు .వీరిద్దరి మూలంగా తనకు ఆత్మహత్య శరణ్యమని పత్రికల వారి ముందు బోరన వినిపించారు. వీరిపై జిల్లా కలెక్టర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని ఇలాంటి ఇబ్బందులు తలెత్తితే మారుమూలల ఉన్న అంగన్వాడీలు మరింత బాధపడుతున్నారు ఎవరికి తెలవని ప్రశ్నగా మిగిలిపోయింది. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని అంగన్వాడి టీచర్ సుకన్య కోరుతున్నారు.

# గృహ జ్యోతి విద్యుత్ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**తొర్రూరు,మార్చి 2(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గృహ జ్యోతి విద్యుత్ పథకాన్ని అధికారులతో కలిసి తొర్రూర్ మున్సిపాలిటీ ఒకటవ వార్డులో ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.ఆమె ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం తక్కువ సమయంలోనే ప్రజలకు ఉపయోగపడే పథకాలను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఎవరు ఎదురొచ్చి అడ్డుకున్న సరే అమలు చేసే పథకాలను ఆపలేరని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజాప్రతినిధులు ,పార్టీ ముఖ్య నాయకులు, యూత్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సి కార్పొరేషన్ పెండింగ్ రుణాలు విడుదల చేయాలి

### - కెవిపిఎస్ పట్టణ నాయకులు గంగుల వెంకటేష్



**మరిపెడ, మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** 2018 నుండి పెండింగ్‌లో ఉన్న ఎస్సి కార్పోరేషన్ రుణాలను కొత్త ప్రభు త్వం తక్షణమే విడుదల చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పట్టణ నాయకులు గంగుల వెంకటేష్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వెంకటేష్ విలేకరులతో మాట్లాడుతూఎస్సీ కార్పొరేషన్ 2018- 19 2020 -21 లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలు వెంటనే విడుదల చేయాలన్నారు. గత మూడు సంవత్సరాల నుండి రుణం మంజూరి అయినప్పటికీ సబ్సిడీ నిధులు విడుదల చేయకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పేరుతో కాలం గడిపిందని, ఓట్లు వేస్తేనే దళిత బంధిస్తామని , దళితులను మోసగించాలని చూసిన ప్రభుత్వానికి దళితులు తగిన గుణపాఠం చెప్పారని వెంకటేష్ అన్నారు.లబ్ధిదారులు నిరుద్యోగులు రుణాలు రాక కూలి పనులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారుల కు రుణాలు అందితే కొంత మెరుగైన జీవితం గడుస్తుందని,గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఈ కొత్త ప్రభుత్వంలోనైన నిధులు సకాలంలోవిడుదల చేసి లబ్ధిదారులను ఆదుకోవలన్నారు.

# రాడిసన్ హెూటల్ డ్రగ్స్ కేసు.. రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెల్లడి!




**హైదరాబాద్,మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** గచ్చిబౌలిలోని రాడిసన్ హెూటల్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే డ్రగ్స్ పార్టీ నిర్వహించిన వివేకానందతో పాటు పలువురిపై కేసులు నమోదు చేసిన పోలీసులు.. తాజాగా హెూటల్ ఆపరేషన్ మేనేజర్‌పై కూడా కేసు నమోదు చేశారు.రాడిసన్ హెూటల్‌లోని 1200, 1204 రూమ్‌లలో డ్రగ్స్ పార్టీ నిర్వహించారు. ఇటీవల పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఆ రూమ్‌ల్లో డ్రగ్స్ లభించాయి. హెూటల్‌లోనే డ్రగ్స్ లభించడంతో ఆపరేషన్ మేనేజర్‌పై కూడా కేసు ఫైల్ చేసినట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ పార్టీ అని తెలిసే ఆపరేషన్స్ మేనేజర్ అనుమతించినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.ఇక రాడిసన్ హెూటల్ డ్రగ్స్ కేసు రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు బయటపడ్డాయి. రిమాండ్ రిపోర్టు ప్రకారం.. ప్రధాన నిందితుడు వివేకానంద ఆదేశాలతో డ్రైవర్ ప్రవీణ్‌కు పెడ్లర్ మీర్జా వాహిద్ డ్రగ్స్ అందజేశాడు. స్నాప్‌చాట్ యాప్ ద్వారా చాట్ చేస్తూ డ్రగ్స్‌ను డెలివరీ చేశారు. మీర్జా నుంచి 4 గ్రాముల కొకైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ పెడ్లర్ సయ్యద్ అబ్బాస్ అలీ ద్వారా వివేకానంద్‌కు డ్రగ్స్ సరఫరా చేసినట్లు తెలిసింది. ఒక్క ఫిబ్రవరి నెలలోనే పది సార్లు డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. రెండు గ్రాములకు రూ.30 వేలకు పైగానే గూగుల్ పే ద్వారా చెల్లించినట్లుగా తెలిసింది. ఫిబ్రవరి 24వ తేదీన జరిగిన డ్రగ్స్ పార్టీలో 10 మంది నిందితులు ఉన్నారని.. వారందరికీ మీర్జానే కొకైన్ అందజేసినట్లుగా పోలీసులు గుర్తించారు. కాగా, వాహిద్ రిమాండ్ రిపోర్టులోడైరెక్టర్ క్రిష్ పేరును కూడా పోలీసులు ప్రస్తావించారు.

# తాగడానికి నీరు రావట్లేదని కాళీ బిందెలతో మహిళల నిరసన

**బీర్కూర్, మార్చి 2 (పీసిడబ్ల్యూ న్యూస్):**మండల కేంద్రంలోని ఇందిరా కాలనీలో గతవారం రోజుల నుండి తాగునీటి సమస్య ఉంది. త్రాగడానికి మంచి నీరు రాకపోవడం వల్ల ఈ సమస్య గురించి గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోవట్లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్ ట్యాంక్ లో మంచి నీరు వదలకుండా మిషన్ భగీరథ కుల్లు నీళ్ళు వదిలి పెడుతున్నారు. ఈ నీళ్ళు తాగడం వల్ల వ్యాధులు వ్యాపిస్తున్నాయి. మిషన్ భగీరథ నీరు వాడడానికి తప్ప త్రాగడానికి పనికి రావట్లేదని. ఎన్నిసార్లు గ్రామ పంచాయతీ సిబ్బందికి విన్నవించుకున్న త్రాగు నీటి సమస్యను పరిష్కరించట్లేదని సర్పంచుల పదవీకాలం అయిపోవడం వల్ల గ్రామ పంచాయతీ సిబ్బంది ఇష్టారాజ్యం అయింది. దీనికి ఇంచార్జీ గా ఉన్న తహసీల్దార్ స్పందించక పోవడం వల్ల ఈ పరిస్తితి ఏర్పడిందని కాలనీ వాసులు ఖాళీ బిందెలతో గ్రామ పంచాయితీ నందు మహిళలు నిరసన వ్యక్తం చేశారు.



# భర్తను అన్‌ఫాలో చేసిన నయనతార.. కారణం అదేనా!



స్టార్ కపుల్స్ నయనతార, విగ్నేష్ శివన్ గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. టాలీవుడ్, కోలీవుడ్ లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఈ ఇద్దరు ఏడేళ్లపాటూ ప్రేమించుకుని పెద్దల అంగీకారంతో 2022 జూన్‌లో పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. పెళ్లికంటే ముందే సరోగసి ద్వారా ఇద్దరు పిల్లలకు తల్లి దండ్రులు అయ్యారు. అయితే స్టార్ జంట మధ్య గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. రీసెంట్‌గా నయనతార తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నుంచి విగ్నేష్ శివన్‌ని అన్ ఫాలో చేసింది. దీంతో వీరిద్దరు విడాకులు తీసుకోబోతున్నారని ప్రచారం జరుగుతోంది.నయనతార ఇటీవలే ఇన్‌స్టాలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. వారి పిల్లలను చూపిస్తూ తొలిపోస్ట్ చేసింది. ఇక దానికి లక్షల లైక్‌లు, కామెంట్స్ వచ్చాయి. ప్రస్తుతం నయనతారకు ఇన్‌స్టాలో 78లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. అయితే, తాజాగా నయనతార తన భర్త విఘ్నేశ్ శివన్‌ను ఇన్‌స్టాలో అన్‌ఫాలో చేయడం చర్చనీయాంశంగా మారింది. కాగా దీనిపై నయనతార క్లారిటీ ఇవ్వవలసి ఉంది.

# ప్రశాంత్ నీల్ ఇంట్లో ప్రైవేట్ పార్టీ.. సందడి చేసిన ఎన్టీఆర్, రిషబ్ షెట్టి



కేజీఎఫ్, సలార్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ ఇంట్లో టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ దంపతులు సందడి చేశారు. జూనియర్ ఎన్టీఆర్ శుక్రవారం బెంగళూరుకు పయనమైన విషయం తెలిసిందే. దేవర షూటింగ్‌లో భాగంగా వెళుతున్నాడేమో అని అందరూ అనుకున్నారు. కానీ ప్రశాంత్ నీల్ ఇంట్లో ప్రైవేట్ పార్టీ ఉండగా.. ఎన్టీఆర్ – లక్ష్మీ ప్రణతి కలిసి వెళ్లారు. ఇక వీరితో పాటు కాంతార నటుడు రిషబ్ షెట్టి ఫ్యామిలీ, మైత్రీ మూవీ మేకర్స్ అధినేత యలమంచిలి రవి శంకర్ కూడా ఈ పార్టీలో పాల్గొన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఇక సినిమాల విషయానికి వస్తే.. రిషబ్ షెట్టి కాంతార ప్రీక్వెల్‌లో నటిస్తుండగా ఎన్టీఆర్ దేవర చిత్రంలో నటిస్తున్నాడు. కొరటాల శివ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నాడు. జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ కావడంతో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ సినిమా గ్లింప్స్ విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.

# కాశీలో తమన్నా హల్ చల్



ప్రముఖ నటి తమన్నా కాశీలో హల్ చల్ చేస్తున్నారు. ఒక సినిమా షూటింగ్ లో భాగంగా వారణాసికి వెళ్లిన తమన్నా, పనిలో పనిగా కాశీ విశ్వనాథుడిని దర్శించుకుని, భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణమంతా కలియదిరుగుతూ సరదాగా గడిపారు. ఆ తర్వాత గంగానదిలో స్నానమాచరించి, కాసేపు ఒడ్డున సేదతీరారు. ఈ ఫోటోలు నెట్లో వైరల్ అవుతున్నాయి.తమన్నా ఓదెల 2 మూవీ షూటింగ్ లో భాగంగా వారణాసికి వెళ్లారు. రెండేళ్ల క్రితం ఓదెల రైల్వే స్టేషన్ మూవీ ఓటిటిలో విడుదలై హిట్ అయిన సంగతి తెలిసిందే. దీనికి సీక్వెల్ గా ఓదెల 2 మూవీ షూటింగ్ శుక్రవారం వారణాసిలో ప్రారంభమైంది. ఈ మూవీకి సంపత్ నంది క్రియేటర్ కాకా అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్నారు. మరో హీరోయిన్ హెబ్బా పటేల్ ఓ ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. కాంతారా ఫేమ్ అజనీష్ లోక్ నాథ్ సంగీత దర్శకత్వం వహిస్తున్నారు.

# నేషనల్ క్రష్ కాదు.. ఇంటర్నేషనల్ క్రష్..

రష్మిక ఇమేజ్ దేశం దాటి ఇప్పుడు విదేశాలకు కూడా పాకినట్టుంది. 'పుష్ప', 'యానిమల్' చిత్రాలతో ప్రపంచవ్యాప్త గుర్తింపు సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ.. క్రంచీరోల్ అనిమీ అవార్డ్స్ ఫంక్షన్‌లో మన దేశం తరఫున పాల్గొనేందుకు జపాన్‌లోని టోక్యోకి వెళ్లింది. అంతే.. టోక్యో ఎయిర్‌పోర్ట్‌లో రష్మికకు అక్కడి అభిమానులు బ్రహ్మరథం పట్టారు.రష్మిక ఫొటోలతో డిజైన్ చేసిన ప్లకార్డులను చూపిస్తూ.. రష్మికకు గ్రాండ్ వెల్కం చెప్పారు. ఈ పరిణామాన్ని చూసి రష్మిక ఆశ్చర్యానికి లోనైంది. ఇక్కడ కూడా ఇంతమంది అభిమానులున్నారంటే నమ్మలేకపోతున్నానంటూ ఆనందం వెలివెబుచ్చింది. గ్లోబల్ ఈవెంట్‌గా జరుగుతున్న ఈ అవార్డుల కార్యక్రమంలో మన దేశం తరఫున ప్రాతినిథ్యం వహించే అవకాశం రష్మికను వరించింది. ఈ గౌరవం దక్కించుకున్న తొలి నటిగా రష్మిక నిలవడం నిజంగా గర్వకారణం.






# 'ప్రేమలు' ట్రైలర్ అప్‌డేట్ ఇచ్చిన మేకర్స్

రీసెంట్‌గా మలయాళంలో బ్లాక్ బస్టర్ అయిన తాజా చిత్రం ప్రేమలు. ఈ చిత్రం రూ.11 కోట్ల బడ్జెట్‌తో వచ్చి కేవలం 15 రోజుల్లోనే రూ.80 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇక ఈ సినిమాను తెలుగులో టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు రాజమౌళి కుమారుడు ఎస్.ఎస్ కార్తికేయ విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా తెలుగు వెర్షన్‌కు సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. మార్చి 08న ఈ సినిమాను విడుదల చేయనున్నారు. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం నుంచి ట్రైలర్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్.ఈ సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్‌లోని విజేత్ కాలేజీలో ఈరోజు సాయంత్రం 7 గంటలకి లాంచ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఇక తెలుగు ట్రైలర్ విడుదలయ్యాక ఈ సినిమాపై అంచనాలు ఎలా ఉంటాయో చూడాలి.

# కిటకిటలాడుతున్న జామ్ నగర్.. బాలీవుడ్ సెలబ్రిటీస్ అందరూ అక్కడే!



రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, ఆసియాలోనే అత్యంత ధనవంతుడు అయిన ముఖేశ్ అంబానీ కుమారుడి ప్రీ వెడ్డింగ్ వేడుకలు గుజరాత్ లోని జామ్ నగర్ లో వైభవోపేతంగా జరుగుతున్నాయి. తొలిరోజు ఈ వేడుకలకు దేశవిదేశాలనుంచి ప్రముఖులు హాజరయ్యారు. బాలీవుడ్ సెలబ్రిటీస్ షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, దీపికా పదుకొనే, రణ్వీర్ సింగ్, అలియా భట్, సయిఫ్ అలీఖాన్, కరీనా కపూర్, అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్, మెటా సిఇఓ మార్క్ జుకర్ బెర్గ్, ఆయన సతీమణి ప్రిసిల్లా చాన్, ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ఎమ్మెస్ ధోని, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్, పలువురు రాజకీయ నాయకులు తొలిరోజు వేడుకల్లో పాలుపంచుకున్నారు.ఈ వేడుకలకు తన భార్యతో సహా నల్లటి దుస్తులు ధరించి హాజరైన జుకర్ బెర్గ్ తమ ఫోటోని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, భారతీయ వివాహానికి హాజరైనందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. త్వరలో ఒకటి కానున్న అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ లకు శుభాకాంక్షలు చెప్పారు. తొలి రోజు వేడుకల్లో పాప్ స్టార్ రిహానా ప్రధాన ఆకర్షణగా మారింది. తనదైన గానంతో ఆమె ఆహూతులను ఉర్రూతలూగించింది.

# మొగలిరేకులు సీరియల్ నటుడు పవిత్రనాథ్ మృతి

బుల్లితెరపై సంచలనం సృష్టించిన మొగలిరేకులు, చక్రవాకం సీరియల్స్ ద్వారా ప్రేక్షకులకు దగ్గరై ఇంద్ర తమ్ముడిగా దయ పాత్రలో మెప్పించిన నటుడు పవిత్రనాథ్ మృతిచెందాడు. ఈ విషయాన్ని ఇంద్రనీల్ భార్య మేఘన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. 'పవి.. ఈ బాధను మేం వర్ణించలేకపోతోన్నాం.. మా జీవితంలో నువ్వు చాలా ముఖ్యమైన వాడివి.. మేం ఈ వార్త విన్న తరువాత.. ఇది నిజం కాదని, కాకూడదని కోరుకున్నాము. ఇకపై నిన్ను చాలా మిస్ అవుతాం.. నీ ఆత్మకు శాంతి చేకూరాలి.. నీ ఫ్యామిలీకి ఆ దేవుడు మరింత శక్తిని ఇవ్వాలి' అంటూ ఇంద్రనీల్, మేఘన ఎమోషనల్ గా పోస్ట్ చేశారు.



# సినిమా చూడకుండానే రివ్యూ ఇవ్వకండి : యామి గౌతమ్



బాలీవుడ్ నటి యామి గౌతమ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఆర్టికల్ 370'. ఈ సినిమాకు ఆదిత్య సుహాస్ జంభలే దర్శకత్వం వహించగా.. జియో స్టూడియోస్,62 స్టూడియోస్ బ్యానర్‌లపై ఉరి: ది సర్జికల్ స్ట్రైక్ ఫేమ్ ఆదిత్య ధర్ నిర్మించాడు. ఇక ఫిబ్రవరి 23న ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రస్తుతం పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. అయితే ఈ సినిమాను అరబ్ దేశాలు బ్యాన్ చేసిన విషయం తెలిసిందే.